కూతుళ్ళంటుంది. వాళ్ళను ఎత్తుకుంటుంది. తన రొమ్ములకు చేర్చి, పాలు దాగమంటుంది. వాళ్ళు ... పాలురాని రొమ్ముల్ని కరిచి ఏడుస్తుంటే ... తనూ ఏడుస్తుంది...!

గోడవారకి చేరి ఏడుస్తోన్న భార్య దగ్గరకు ఆదెయ్య వెళ్లాడు. ఆమె గడ్డాన్ని పట్టుకొని అనునయించాడు. తీసుకొచ్చిన అన్నం ముద్దలు తినిపించేడు. తను కన్నీటిని మింగి... ఏ ఝాముకో నిద్రబోయాడు.

మర్నాడు ఎమ్మార్వో కార్యాలయం ముందటి – తురాయి చెట్టు కింద – ధర్నా శిబిరంలో కూర్చున్నాడు ఆదెయ్య. ఆ మండలంలోని తలారీలు మరో పదిహేను మందిదాకా ... శిబిరంలో కూర్చున్నారు.

"...జీతాలు పెంచటం కొప్పుకోరట..."

"...ధర్నా యిరమించుకుంతే, మిగిలిన డిమేండ్లు ఆలోసిస్తారట..."

"దిగినోలిమి, పూర్తిగా తాడోపేడో తేలిందాక యిరమించొద్దు."

"ఈ రోజు సాయంత్రంకి తేలప్పోతే రేపు రాస్తారోకో వుందట" యిలా, తలా ఒకరకంగా, కూర్చున్నవాళ్ళు మాట్లాడుకుంటున్నారు.

"...ఏ విషయమూ సాయంత్రానికి తేల్తాది..."

మండలస్థాయి తలారీల నాయకుడు ప్రకటన.

ఆదెయ్యకు ... ఈ మాటలొక పక్క, మరోపక్క తల్లి అనారోగ్యం... డాక్టరు మాటలు ... యింకోపక్క రాజు మేస్టారి మాటలూ ... అన్నీ కలగాపులగంగా ... చెవుల్లో గింగురు మంటున్నాయి.

"అశ్రద్ద జేస్సారు. టైఫాయిడ్ ముదిరిపోయింది. మరోపక్క బి.పి. వొచ్చింది. ఇరవయి నాలుగ్గంటలు దాటితేగాని... నమ్మకం చెప్పలేను..." రాత్రి వేకువజామున, యింజక్షనిచ్చి బసవలింగం డాక్టరుగారు చెప్పిన మాటలు గుర్తుకొచ్చేయి. అపస్మారకంగా అలా ... చావుబతుకుల మంచం మీదనున్న తల్లి గుర్తొచ్చింది.

మతిలేని తన భార్యనూ, పసికందులు మనవరాళ్ళనూ ... సంరక్షణ చేసుకుని, తనను కనిపెట్టుకు వచ్చిన తల్లి ... మనసులో కదిలేక విలవిలలాడిపోయేడు. శిబిరంలోని, సాటి మిత్రులకు పరిస్థితిని వివరించి, అక్కడ నుంచి – యింటికి నడిచేడు ఆదెయ్య.

ఆదెయ్య శిబిరం నుంచి ఊరు చేసేసరికి సాయంత్రమవుతోంది. మేతకు వెళ్ళిన పశువులు తిరిగొస్తున్నాయి. పడమటి కొండల్లో పొద్దు ఆఖరి చూపులో వుంది. ఇంటివైపు నడుస్తుంటే, మంగలి లక్ష్మోజీ ఎదురొచ్చి –

"...బావొరే, ఆదెయ్యా, వి.ఏ.వో. బావు నలమాటు పంపేడ్రా నీకోసం, ఇంటికాడలేడు బావూ అనంటే యినడు" చెప్పాడు.

